SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

సీమకిరణం

RNI APTEL / 2018/76380

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

Printed and Published From: Kurnool/Nandyala | సంపుటి 08 | సంచిక 203 | శనివారం 7-11-2026 | పేజీలు 4 | వేల రూ: 2/

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యువ హీరో తేజ



- త్వరలో పెళ్లి పీటలెక్కనున్న యువ హీరో తేజ సజ్జా.. నవంబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో వివాహం!
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన నిశ్చితార్థ వేడుకకు ఆహ్వానించిన తేజ సజ్జా.
- పెద్దలు కుదిర్చిన సంబంధానికే ఓకే చెప్పిన యువ హీరో.. తల్లిదండ్రులు చూసిన అమ్మాయితోనే ఏడడుగులు!

2లో

ఓబీసీ క్రీమీ లేయర్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- ఓబీసీ రిజర్వేషన్ల క్రీమీలేయర్ నిర్ధారణపై సుప్రీంకోర్టు స్పష్టత
- పాత నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీ జాబితాలకు రక్షణ
- గతంలో పూర్తయిన ఎంపికలను తిరగరాయడానికి వీల్లేదని స్పష్టీకరణ
- ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వేలాది మందికి ఊరట
- పెండింగ్ కేసులను మెరిట్స్ ఆధారంగా పరిష్కరించుకోవచ్చని సూచన



2లో

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు



2లో

- నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత
- సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీలు, డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో నిఘా
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు
- 9,062 కౌంటింగ్ బల్లలపై ఓట్ల లెక్కింపు ప్రక్రియ
- 11 వేల మందికి పైగా పర్యవేక్షకులు, 28 వేల మందికి పైగా సహాయకుల నియామకం
- 70.72 శాతం పోలింగ్ నమోదు.. గత ఎన్నికలతో పోలిస్తే 9.81 శాతం పెరుగుదల
- ఏడు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ ప్రశాంతంగా పూర్తి
- తొలుత పోస్టల్ బ్యాలెట్లు.. అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ బ్యాలెట్ల లెక్కింపు

గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన



-పొలం గట్లు, పంట బోదెలపై వెళ్తూ దెబ్బతిన్న పంటల పరిశీలన
-జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు కాలినడకన బాధిత రైతులతో మాట్లాడిన సీఎం
-పట్టిసీమ వరమచ్చినా... ప్రకృతి కరుణించలేదని రైతుల ఆవేదన
-చివరి బాధితునికి సైతం సాయం అందే వరకు పని చేస్తామని సీఎం హామీ



అమరావతి, **సీమ కిరణం** : మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను, వరద నీటితో మునిగిన పొలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం బాపట్ల జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు నడుచుకుంటూ వెళ్లి రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి రేటూరు గ్రామం వరకు కాలినడకన సాగిన ముఖ్యమంత్రి.. దారిపొడవునా రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యమధ్యలో పొలాల వద్ద ఆగుతూ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పంట కాలువ గట్లు, పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. రైతులు పెట్టిన పెట్టుబడులు, పంట దిగుబడి అంచనాలు, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహ ఉధృతిని పరిశీలించిన ముఖ్యమంత్రికి వాగు ఉధృతి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలు నీట మునిగిన తీరును రైతులు, అధికారులు వివరించారు. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వెళ్లే మార్గంలో పలు చోట్ల కోతకు గురైన రహదారిని పరిశీలించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 161 పీజీ సీట్లు మంజూరు

11 కళాశాలల్లో 15 వైద్య విభాగాల్లో సీట్లకు ఎన్ఎంసీ అనుమతులు

163 సీట్లకు ప్రతిపాదనలు.. 98.77 శాతం సాధన

మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువ



అమరావతి,**సీమ కిరణం**

రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 161 కొత్త పీజీ వైద్య సీట్లను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. మొత్తం 15 స్పెషాలిటీల్లో ఈ సీట్లు వచ్చాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి 163 సీట్లకు ప్రతిపాదనలు పంపగా ఎన్ఎంసీ 161 సీట్ల (98.77 శాతం)కు అనుమతించింది. కూటమి ప్రభుత్వం సదరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధనా సిబ్బంది నియామకాలు, పడకల పెంపు, వైద్య పరికరాలు, మౌలిక వసతులను

మిగతా 2లో

- 2026--27 విద్యా సంవత్సరానికి 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అదనపు సీట్లు
- 15 వైద్య విభాగాల్లో సీట్లకు ఎన్ఎంసీ ఆమోదం
- 163 సీట్లకు ప్రతిపాదనలు పంపగా 161 సీట్లకు అనుమతి
- 98.77 శాతం ప్రతిపాదనలకు ఆమోదం లభించడం విశేషం
- బోధనా సిబ్బంది నియామకాలు, మౌలిక వసతుల కల్పనతో పెరిగిన సీట్లు
- మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువ
- ఆర్థోపెడిక్స్‌లో 27 సీట్లు మంజూరు
- డీవీఎల్, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున సీట్లు
- రేడియో డయాగ్నోసిస్‌లో 14 సీట్లు.. పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీలో 12 చొప్పున
- జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్‌లో 8 చొప్పున
- ఎమర్జెన్సీ మెడిసిన్, గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీలో 4 చొప్పున
- అత్యవసర చికిత్స, క్యాన్సర్ చికిత్స సహా కీలక వైద్య రంగాలకు నిపుణుల బలం
- 2026--27 పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీకి చర్యలు
- డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ వెల్లడి

రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయాం



2లో

- మురసు తుఫాన్‌తో ప్రాథమికంగా రూ.1,919.59 కోట్ల నష్టం
- తక్షణ మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ

వంద శాతం విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యం

- రెండు తుపానులతో విద్యుత్ శాఖకు రూ.500 కోట్లకుపైగా నష్టం
- మురసు తుపానుతో 7,500కు పైగా స్తంభాలు నేలకూలాయి
- మూడు రాష్ట్రాల నుంచి 3 వేల మందికిపైగా సిబ్బంది సేవలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



2లో

SK1 NEWS HD
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్: యస్. సకార్ అహ్మద్ బాషా
RNI APTEL / 2018/76380

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

అమరావతి, రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండవ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈనెల 7 వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 365 లెక్కింపు కేంద్రాల్లో సుమారు 9,062 లెక్కింపు బల్లలపై ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం 11,002 మంది లెక్కింపు పర్యవేక్షకులు, 28,692 మంది లెక్కింపు సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారని ఎన్నికల కమిషనర్ పునేతా తెలిపారు.

ఈ ఎన్నికల్లో 77 జెడ్పీటీసీ లు, 2,051 ఎంపీటీసీ లు ఏకగ్రీవం కాగా, మిగిలిన 577 జెడ్పీటీసీ లు, 7,707 ఎంపీటీసీలు 5న పోలింగ్ నిర్వహించారని, మొత్తం పోలింగ్ శాతం 70.72గా నమోదైందని ఆయన తెలిపారు. గత 2021 ఎన్నికల పోలింగ్ శాతం 60.91తో పోలిస్తే 9.81 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించారు.

బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం వంటి ఘటనల నేపథ్యంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో 6న రీపోలింగ్ నిర్వహించేందుకు ఆదేశించామని ఈ మేరకు ఆయా జిల్లాల్లో పోలింగ్ ప్రక్రియ కూడా సజావుగా ముగిసిందని తెలిపారు.

ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం బ్యాలెట్ పెట్టెల్లోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తారని తెలిపారు. మొత్తం లెక్కింపు బల్లల్లో 50 శాతం జెడ్పీటీసీ లకు, మిగిలిన 50 శాతం ఎంపీటీసీ లకు కేటాయించారని, ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను లెక్కింపు కోసం అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రత, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు.

కౌంటింగ్‌కు భారీ పోలీసు బందోబస్తు.....

రాష్ట్ర పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నవంబర్ 5వ తేదీన నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాల్లో 19,885 మంది పోలీసు సిబ్బందితో మూడు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బందోబస్తు విధుల్లో భాగంగా డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు 135 మంది, ఇన్‌స్పెక్టర్లు 572 మంది, సబ్‌ఇన్‌స్పెక్టర్లు 1,412 మంది, అడిషనల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ల నుంచి పోలీసు కానిస్టేబుళ్ల వరకు 14,877 మంది, హోమ్ గార్డ్ లు 2889 మంది కలిపి మొత్తం 19,885 మంది పోలీసులతో కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఐజీ తెలిపారు. అదేవిధంగా సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ సర్వెలెన్స్‌తో పాటు పోలీసు సిబ్బంది ధరించే బాడీ వోర్న్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 161 పీజీ సీట్లు మంజూరు

కల్పించడం ద్వారా 161 సీట్లు అదనంగా రావడంతో మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువైంది.

ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు:

వైద్య విభాగాల వారీగా ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు మంజూరయ్యాయి. చర్మ, సుఖ వ్యాధుల విభాగం (డీవీఎల్), ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున, రేడియో డయాగ్నోసిస్ 14, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ విభాగాల్లో 12 చొప్పున, జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్ విభాగాల్లో 8 చొప్పున, ఎమర్జెన్సీ మెడిసిన్, ప్రసూతి, గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో 4 చొప్పున సీట్లు లభించాయి. ఎమర్జెన్సీ మెడిసిన్, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో మంజూరైన సీట్లు అత్యవసర చికిత్స, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స వంటి ప్రాధాన్య రంగాల్లో వైద్య నిపుణుల సంఖ్యను పెంచనున్నాయి. ప్రస్తుతం మంజూరైన 161 సీట్లను 2026--27 విద్యా సంవత్సర పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

కిందటి విద్యా సంవత్సరంలో 13 ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి మొత్తం 150 పీజీ వైద్య విద్య సీట్ల మంజూరుకు దరఖాస్తులు వెళ్లాయి. వీటి పరిశీలన అనంతరం ఎన్‌ఎంసి 142 సీట్లను మంజూరు చేసింది.

'కూటమి అరాచక పాలనపై ప్రజల తిరుగుబాటు తప్పదు'

అనంతపురం : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను అధికార కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా కేవలం పోలీసుల లాఠీలు, అక్రమ నిర్బంధాలతో పూర్తిగా ప్రహసనంగా మార్చేసిందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా బలవంతంగా పత్రాలు లాక్కోవడం, వేసిన నామినేషన్లను అధికారులతో కుమ్మక్కై తిరస్కరించడం, పోలింగ్ ఏజెంట్లను, ముఖ్య నాయకులను రాత్రికి రాత్రే పోలీస్ స్టేషన్లలో నిర్బంధించి ఏకపక్షంగా రిగ్గింగ్‌లకు పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలుగుదేశం పార్టీకి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మధ్య జరిగిన ఎన్నిక కాదని, ప్రజల స్వేచ్ఛా హక్కులపై అధికార మదంతో ప్రభుత్వం కాకీ చొక్కాలను అడ్డుపెట్టుకుని చేసిన దాడి అని ఆయన స్పష్టం చేశారు.

నామినేషన్ల అపహరణ.. అధికారులతో తిరస్కరణ..

పెద్ద ఎత్తున అభ్యర్థుల చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు బలవంతంగా లాక్కోవడం నీకే చెల్లింది చంద్రబాబూ?. నామినేషన్లను అడ్డుకోవడం ద్వారా మీరు వేలాది స్థానాల్లో ఏకగ్రీవాలు చేసుకుని మీరు అనుకున్న ప్రగతిని సాధించారు. ఇక ధైర్యం చేసి వేసిన నామినేషన్లలో కూడా కనీసం 30 శాతం నామినేషన్లను మీ అనుకూల ఆర్వోలతో స్క్రూటినీలో కావాలని రిజెక్ట్ చేయించారు. వేలాది సంఖ్యలో ఈ విధమైన అక్రమాలకు పాల్పడ్డారు.

అక్రమ కేసులు, బెదిరింపు నోటీసులు

ఎన్నికల కంటే ముందే వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై అడ్డగోలుగా అక్రమ కేసులు బనాయించారు. ప్రచారాల సందర్భంలోనూ తప్పుడు కేసులు పెట్టి, బైండోవర్లకు కట్టుబడి లేరంటూ ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు, రూ. 5 లక్షలు వసూలు చేస్తామని బెదిరింపు నోటీసులు జారీ చేసి భయాందోళనలు సృష్టించారు.

రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయాం

అమరావతి, వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, మురసు తుఫాన్ కారణంగా ప్రాథమికంగా రూ. 1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. తుఫాను నష్టం నుంచి ఉపశమనం కోసం తక్షణం మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే రెండు వరుస తుఫాన్ల కారణంగా ఏపీపై తీవ్ర ప్రభావం పడిందని సీఎం పేర్కొన్నారు. భారీ వర్షాలు, తీవ్ర గాలుల కారణంగా విద్యుత్, రహదారుల లాంటి మౌలిక సదుపాయాలు ధ్వంసం అయ్యాయని వివరించారు. అక్టోబరు 27 తేదీన అర్నబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న సమయంలోనే మురసు తుఫాన్ విరుచుకు పడటంతో రైతులు, మత్స్యకారులు ఒకే సీజన్‌లో రెండుసార్లు నష్టపోయారని తెలిపారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలు నిర్వహించి మరో 15 రోజుల్లో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు.

తక్షణ సాయంతో రాష్ట్రానికి ఉపశమనం:

మురసు తుఫాన్ కారణంగా వ్యవసాయ రంగంలో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు ప్రభావితం అయ్యారని ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 874.96 కోట్ల నష్టం వాటిల్లిందని, ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులు నష్ట పోయారని తెలిపారు. ఈ రంగానికి రూ. 337.10 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. దీంతో పాటు పశుసంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య శాఖల్లో తీవ్రంగా నష్టం వాటిల్లిందని కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో తెలిపారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో కొంత మేర ఆస్తి నష్టాన్ని తగ్గించ గలిగామని వివరించారు. మురసు తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, గృహాలు దెబ్బతిన్న కుటుంబాలు, ఇతర బాధిత వర్గాలను ఆదుకోవడానికి, రాష్ట్రంలో దెబ్బతిన్న అత్యవసర మౌలిక సదుపాయాలు, సేవలను పునరుద్ధరించడానికి కేంద్ర హోం శాఖ తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

ఓబీసీ క్రీమీ లేయర్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ,ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్లకు సంబంధించి క్రీమీ లేయర్ నిర్ధారణపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ ఏడాది మార్చి 11న ఇచ్చిన జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఆర్. మాహదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన సంచలన తీర్పుపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. కేంద్రం దాఖలు చేసిన వివరణ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పిచ్చింది. ఈ తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా ఉద్యోగులు, అభ్యర్థుల్లో నెలకొన్న తీవ్ర గందరగోళానికి తెరపడింది.

మార్చి 11న ఇచ్చిన తీర్పు వల్ల గతంలో ఎప్పుడో పూర్తయిన నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీ జాబితాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సుప్రీంకోర్టు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఆర్. మాహదేవన్ ధర్మాసనం స్పష్టం చేసింది. పాత నియామకాలను తిరగరాయడానికి ఈ తీర్పును కారణంగా చూపరాదని తేల్చిచెప్పింది. దీంతో ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వేలాది మంది ఉద్యోగులకు పూర్తి రక్షణ లభించినట్టయింది. అలాగే వివిధ కోర్టులు, ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న ఇలాంటి కేసులను సంబంధిత న్యాయస్థానాలు వాటి మెరిట్స్ ఆధారంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొంది.

సివిల్ సర్వీసెస్ – 2025 అభ్యర్థులకు కొత్త రూల్స్:

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 ద్వారా ఎంపికైన 958 మంది అభ్యర్థులకు సర్వీసులు (ఐఏఎస్,ఐపీఎస్ మొదలైనవి) కేటాయించే ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని కోర్టు గుర్తుచేసింది. ఈ కేటాయింపు ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నందున, వీరికి మాత్రం తాజా మార్గదర్శకాల ప్రకారమే (క్రీమీ లేయర్ నిర్ణయానికి జీతంతో పాటు హోదాను కూడా పరిగణలోకి తీసుకునే విధానం) ఓబీసీ క్రీమీ లేయర్ నిబంధన వర్తిస్తుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

క్రీమీ లేయర్ లెక్కించే విధానంపై స్పష్టత:

ఇకపై క్రీమీ లేయర్‌ను నిర్ణయించేటప్పుడు కేవలం తల్లిదండ్రుల జీతాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకోవడానికి వీల్లేదని కోర్టు పునరుద్ఘాటించింది. జీతంతో పాటు వారు పనిచేసిన ఉద్యోగ హోదా, పోస్ట్ కేటగిరీ కూడా కీలకమని స్పష్టం చేసింది. 1993 నాటి కేంద్ర ప్రభుత్వ ఆఫీస్ మెమోరాండం ప్రకారమే ఇది అమలవ్వాలని పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వానికి స్వేచ్ఛ:

ప్రభుత్వ ఉద్యోగాలతో సమానమైన హోదాలను పీఎస్‌యూలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల్లో గుర్తించేందుకు రెండేళ్ల గడువు కావాలని కేంద్రం కోరినప్పటికీ, దానికి నిర్దిష్ట గడువు పెట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇలాంటి విధానపరమైన నిర్ణయాలు, చట్టాల రూపకల్పన పూర్తిగా కేంద్ర ప్రభుత్వం, చట్టసభల పరిధిలోని అంశాలని స్పష్టం చేస్తూ, ఓబీసీ క్రీమీ లేయర్‌పై కొత్త పాలసీని రూపొందించుకునే పూర్తి స్వేచ్ఛ కేంద్రానికి ఉందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.ం

వంద శాతం విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యం

అద్దంకి,అర్నబ్, మురసు తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ప్రతి రైతు, ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శనివారం సాయంత్రానికి 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండు తుపాన్ల కారణంగా విద్యుత్ శాఖకు రూ.500 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. మంత్రి శుక్రవారం అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి తుపాను నష్టాన్ని పరిశీలించారు. జె.పంగులూరు మండలంలోని ముప్పవరం, కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, తూర్పు తక్కెళ్లపాడు, అలవలపాడు గ్రామాలతో పాటు కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు, కొరిశపాడు, కుర్రవానిపాలెం, రావినూతల గ్రామాలను సందర్శించారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.ముప్పవరంలో దెబ్బతిన్న మామిడి తోటలను, కొండమంజులూరులో ధ్వంసమైన నర్సరీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కోటపాడులో కూలిన ఇళ్లు, పశువుల కొట్టాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. తూర్పు తక్కెళ్లపాడులో పొలాల్లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను చూశారు. తుపాను నష్టంపై బాధితులను అడిగి తెలుసుకున్నారు.

పొగాకు సహా పలు పంటలకు నష్టం:

తుపాను ప్రభావంతో మొక్కజొన్న, అరటి, బొప్పాయి, ఉసిరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు, అద్దంకి, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పొగాకు పంటకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం జిల్లాలో పొగాకు బ్యార్నీలు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాన్ని నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పారదర్శకంగా అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యువ హీరో తేజ సజా

హనుమాన్', 'మిరాయ్' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో తేజ సజ్జా. ఈ యువ హీరో త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఇప్పటికే తన పెళ్లి విషయాన్ని స్వయంగా వెల్లడించాడు. ఇప్పుడు ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వానాలను అందించే పనిలో ఉన్నాడు. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన నిశ్చితార్థ ఆహ్వానాన్ని అందించారు. ఈ మేరకు సీఎంని ?కలిసిన ఫొటోలు వైరల్‌గా మారాయి.అయితే తేజ సజ్జా వివాహం పెద్దలు కుదిర్చిన సంబంధమని గతంలోనే స్పష్టం చేశారు. తన తల్లిదండ్రులు చూసిన అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యానని వెల్లడించారు. నవంబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో వివాహ వేడుక జరగనున్నట్లు తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లిని నిర్వహించాలనుకుంటున్నట్లు చెప్పారు.

గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

నల్లమడ వాగు గేట్లు దెబ్బతిన్నాయని, వాటి కారణంగా నీటి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం దెబ్బతిన్న గేట్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పంట పొలాల్లోకి వరద నీరు చేరకుండా నియంత్రించడంతోపాటు, వరద వచ్చినప్పుడు వచ్చే నీటిని సద్వినియోగం చేసుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

రైతులు పడిన కష్టానికి ఫలితం దక్కేలా పని చేస్తున్నాం:

రేటూరు గ్రామంలో నడుచుకుంటూ వెళ్లిన ముఖ్యమంత్రి... వరద నీటిలో మునిగిపోయిన వరి చేలను పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూనే రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేశామని, మంచి దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో తుఫాన్ వచ్చి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం ఎంత



పెట్టుబడి పెట్టారు? పంటల బీమా చేయించుకున్నారా? అనే విషయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అండగా నిలుస్తాయని వివరించారు. పంటల బీమాపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పట్టిసీమ ద్వారా సాగునీరు అందించడంతో పంటలు సాగు చేశారని, మంచి దిగుబడులు వచ్చే సమయంలో మురసు తుఫాన్ నష్టాన్ని మిగిల్చిందని చెప్పారు. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నష్టాన్ని చాలావరకు నివారించగలిగామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు వాటిని తేలిగ్గా తీసుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ... వేగంగా పునరుద్ధరణ:

తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నామని, చివరి బాధితుడికి సాయం అందే వరకు ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టపోయిన పెట్టుబడిలో కొంత మేర ఉపశమనం కలుగుతుందని చెప్పారు. రైతుల పంట నష్టం అంచనాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులకు ఫోన్ల ద్వారా సమాచారం అందుతోందా లేదా...

SK1 NEWS HD
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. సకీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
RNI APTEL / 2018/76380

ముస్లిం సోదరుల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం

- వెల్దుర్తి సర్పంచ్ అభ్యర్థి తిరివీధి రమేష్
- వెల్దుర్తి పట్టణంలో సఫా మసీదును సందర్శించిన తిరివీధి రమేష్, సుధీంద్ర
- మసీదులో మౌలిక వసతుల కల్పనకు హామీ



వెల్దుర్తి నజీర్, నవంబర్ 06 (సీమకిరణం న్యూస్):వెల్దుర్తి గ్రామ ప్రజల సంక్షేమం, అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్న పారిశ్రామికవేత్త, వెల్దుర్తి గ్రామ సర్పంచ్ అభ్యర్థి తిరివీధి రమేష్ మరోసారి తన విశాల దృక్పథాన్ని చాటుకున్నారు. శుక్రవారం వెల్దుర్తి పట్టణంలోని 15వ వార్డులో ఉన్న సఫా మసీదును ఆయన టీవీఎస్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ నిర్వాహకులు తిరివీధి సుధీంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మసీదులో ముస్లిం సోదరులతో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. స్థానికంగా ముస్లిం సోదరులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆరా తీసి, వాటిని శ్రద్ధగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిరివీధి రమేష్ మాట్లాడుతూ... ముస్లిం సోదరులు ఏ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చినా, వాటి శాశ్వత పరిష్కారానికి తాను పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.మసీదు నిర్వహణకు, అక్కడి ముస్లిం సోదరులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని రమేష్ భరోసానిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, వెల్దుర్తి గ్రామ సమగ్రాభివృద్ధి కోసం ముస్లిం సోదరులందరూ తమ అమూల్యమైన సహకారం, మద్దతు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కలచట్లలో మృతుడి కుటుంబానికి టీడీపీ ఆర్థిక భరోసా

రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



ప్యాపిలి, నవంబర్ 6 (సీమ కిరణం న్యూస్):ప్యాపిలి మండలం కలచట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సీ.ఎస్. నాగరాజు (నడిపన్న) అకాల మరణం పట్ల టీడీపీ నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్యాపిలి మండల టీడీపీ నాయకులు బత్తుల రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు కలచట్ల టీడీపీ గ్రామ నాయకుడు గోవింద్ రెడ్డి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని టీడీపీ గ్రామ నాయకులు భరోసా ఇచ్చారు.

సముద్రంలో మునిగిన చెన్నై సోనా బోటు

ఒంగోలు సబర్బన్/ఒంగోలు టౌన్/ చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నై హార్బర్‌కు చెందిన సోనా బోటు ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్ర తీరానికి సమీపంలో సముద్ర జలాల్లో ప్రమాదానికి గురైంది. మురసు తుపాను తాకిడికి కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో 9 మంది మత్స్యకారులు మరణించినట్టు అనుమానిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని సముద్ర తీరానికి 4 మృతదేహాలు చేరగా.. మిగిలిన ఐదుగురి ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్ బృందాలు గాలిస్తున్నాయి. గురువారం కొత్తపట్నం సముద్ర తీరంలో మూడు మృతదేహాలు, మండలంలోని పిన్నివారిపాలెం తీరానికి మరో మృతదేహం కొట్టుకొచ్చాయి.

స్థానిక మత్స్యకారులు ఇచ్చిన సమాచారంతో కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఆర్డీవో టి.చంద్రశేఖర్ రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి కొత్తపట్నం సముద్ర తీరానికి చేరుకున్నారు. చెన్నై మత్స్య శాఖ, చెన్నై హార్బర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. గత నెల 29న చెన్నై హార్బర్ నుంచి కూడిన మూడు సోనా బోట్లలో మత్స్యకార బృందాలు సముద్రంలో చేపల వేటకు బయల్దేరాయి. వీటిలో రెండు రామాయపట్నం పోర్టులో ఆగిపోయాయి. మరోబోటు ప్రమాదానికి గురై మునిగిపోయింది. ఇక ప్రమాదానికి గురైన వారిలో చెన్నై రాయపురానికి చెందిన పక్కిరి సామి (49), రాయపురం వాషర్‌మెన్ పేటకు చెందిన కుప్పం మనోహరన్ (40), రాయపురానికే చెందిన మోహన్ (47), చెన్నై తిరువత్తియూర్‌కు చెందిన రాజేష్ (52), తోండియర్ పేటకు చెందిన మురుగన్ (48), రాయపురానికి చెందిన కుప్పుస్వామి (58), తిరువత్తియూర్‌కు చెందిన విజయ్‌కాంత్ (44), తోండియర్‌కు చెందిన అరవింద్ (40), కడలూరుకు చెందిన నారాయణన్ (57)గా గుర్తించారు.

వెల్దుర్తి ప్రజల చూపు తిరివీధి రమేష్ వైపు!

- తండ్రి శివయ్య ప్రజాసేవా వారసత్వమే స్ఫూర్తి
- జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడిగా, పారిశ్రామికవేత్తగా ప్రత్యేక గుర్తింపు..
- గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు!





వెల్దుర్తి నజీర్, నవంబర్ 06 (సీమకిరణం న్యూస్): వెల్దుర్తి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొన్న నేపథ్యంలో తిరివీధి రమేష్ పేరు చర్చనీయాంశంగా మారుతోంది. జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడిగా, ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందిన ఆయన ఇప్పుడు గ్రామ రాజకీయాల్లోకి అడుగుపెట్టి సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చారు. వ్యాపార రంగంలో సంపాదించిన అనుభవంతో పాటు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ప్రజాసేవా స్ఫూర్తిని కలగలిపి గ్రామాభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. తిరివీధి రమేష్‌కు ప్రజాసేవ కొత్తేమీ కాదు. ఆయన తండ్రి కీర్తిశేషులు శివయ్య గతంలో సుమారు 18 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించి గ్రామానికి సేవలందించారు. ఆ కాలంలో గ్రామ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఇప్పటికీ గ్రామంలో గుర్తు చేసుకుంటుంటారు. తండ్రి సంపాదించిన మంచి పేరు, ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధాన్ని కొనసాగించాలనే ఆశయంతో రమేష్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుస్తున్నారు. వారి సమస్యలను తెలుసుకుంటూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల 15వ వార్డులోని సఫా మసీదును సందర్శించి ముస్లిం సోదరులతో సమావేశమవడం, వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం, మసీదుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తానని హామీ ఇవ్వడం ఆయన పర్యటనలో ప్రత్యేకంగా నిలిచింది. కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెబుతున్నారు. గ్రామంలో రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలనే లక్ష్యాలను ఆయన ముందుకు తీసుకెళ్తున్నారు. పేద కుటుంబాలకు అండగా నిలవడం, గ్రామంలో ఐక్యతను పెంపొందించడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. కీర్తిశేషులు తండ్రి శివయ్య ప్రజాసేవా వారసత్వం ఒకవైపు.. జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడిగా, పారిశ్రామికవేత్తగా తిరివీధి రమేష్‌కు ఉన్న అనుభవం మరోవైపు.. ఈ రెండింటినీ గ్రామాభివృద్ధికి ఉపయోగించాలనే సంకల్పంతో ఆయన సర్పంచ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. వెల్దుర్తిని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని ఆయన పేర్కొంటున్నారు.

వెల్దుర్తి సీహెచ్‌సీలో రాష్ట్రస్థాయి 'టీమ్--9' ఆకస్మిక తనిఖీలు

- వైద్య సేవల నాణ్యత, సిబ్బంది పనితీరుపై సమగ్ర పరిశీలన
- ఆసుపత్రి పరిశుభ్రత, రికార్డులు, ఆరోగ్య పథకాల అమలుపై అధికారుల ఆరా













వెల్దుర్తి నజీర్, నవంబర్ 06 (సీమకిరణం న్యూస్): వెల్దుర్తి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో శుక్రవారం రాష్ట్రస్థాయి 'టీమ్--9' బృందం మరియు జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ జాఫ్రుల్లా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు తీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.
ముందుగా ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయి, వైద్యులు మరియు సిబ్బంది విధులకు సకాలంలో హాజరవుతున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఆసుపత్రి వార్డులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, రోగులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, వైద్య పరికరాల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. అలాగే, రికార్డులు మరియు రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు అర్హులైన పేద ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని సమీక్షించారు.
ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, తనిఖీల్లో గుర్తించిన చిన్నపాటి లోపాలను తక్షణమే సరిదిద్ది సేవలను మరింత మెరుగుపరచాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.
తనిఖీల్లో పాల్గొన్న ప్రముఖ అధికారులు:
ఈ పర్యటనలో డాక్టర్ జాఫ్రుల్లాతో పాటు కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల , హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ & జాయింట్ డైరెక్టర్ డా. జె. నరసింహ నాయక్, బ్లడ్ సెల్ రాష్ట్ర సమన్వయకర్త పి.వి. కిరణ్, ఎన్‌హెచ్‌ఎం బయోమెడికల్ ఇంజనీర్ ఎన్. రమేష్, కమ్యూనిటీ ప్రాసెస్ మేనేజర్ వి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు 94 దోమతెరల పంపిణీ

- మలేరియా, డెంగీ నివారణపై అవగాహన
- సుస్థిర జీవనశైలిపై విద్యార్థినులకు ప్రతిజ్ఞ

డాక్టర్ రాహుల్





ప్యాపిలి, నవంబర్ 6 (సీమ కిరణం న్యూస్): జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు ప్యాపిలి పట్టణంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు 94 దోమతెరలను (ఎల్ఎల్ఐఎన్ఎస్) పంపిణీ చేశారు. ప్యాపిలి వైద్యాధికారి డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను పరిశీలించి శుభ్రం చేయాలని, నీటి తొట్టెలు, పాత్రలకు మూతలు పెట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని విద్యార్థినులకు వివరించారు.
అనంతరం డాక్టర్ రాహుల్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రాఘవేంద్ర గౌడ్ సుస్థిర జీవనశైలి (బ్రిక్స్) కార్యక్రమంలోని ఏడు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇందులో విద్యుత్ ఆదా, నీటి సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సుస్థిర ఆహారపు అలవాట్లు, ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ నివారణ, వ్యర్థాల తగ్గింపు, ఈ-వ్యర్థాల నియంత్రణ వంటి అంశాలను వివరించారు.
ఈ సందర్భంగా విద్యార్థినులతో సుస్థిర జీవనశైలి ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ రాజారావు, పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు ప్రియాంక, అధ్యాపకులు, హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామి, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్త మల్లేశ్వరి పాల్గొన్నారు.

SK1 NEWS HD
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
RNI APTEL / 2018/76380
జాతీయ తెలుగు దినపత్రిక

అతని చేతిలో దారుణంగా మోసపోయా: రెజీనా



తెలుగు, తమిళ చిత్రాల్లో హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రెజీనా కసాండ్రా. తాజాగా ఈ నటి తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో ప్రేమలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ సమయంలో పడిన మానసిక వేదన గురించి మాట్లాడారు.

'2020లో నా ప్రేమ బ్రేకప్ అయింది. ఆ బంధంలో నేను దారుణంగా మోసపోయా. నమ్మిన మనిషే వెన్నుపోటు పొడవడంతో నా మనసు ముక్కలైంది' అని రెజీనా పేర్కొన్నారు. ఆ బాధ నుంచి బయటపడటానికి చాలా కాలం పట్టిందని, ఆ సమయంలో తనకు ఎదురైన మానసిక వేదనను మాటల్లో చెప్పలేనని తెలిపారు.

ప్రేమించుకోవడం నేర్చుకున్నా..
'నా సమయాన్ని, నా ఆలోచనలను నాకోసమే కేటాయించుకోవాలని నిర్ణయించుకున్నాను. సరిగ్గా అదే సమయంలో కరోనా లాక్‌డౌన్ మొదలైంది. ఆ సమయం నాకు ఒక విధంగా వరంగా మారింది. బయటి ప్రపంచానికి దూరంగా ఉంటూ నన్ను నేను ప్రేమించుకోవడం నేర్చుకున్నాను. ఆ రోజుల్లో నాకు నేను ఇచ్చుకున్న ధైర్యమే ఈ రోజు నన్ను ఈ స్థాయి ప్రశాంతతకు చేర్చింది' అని రెజీనా వివరించారు.

కెరీర్‌లో కొత్త ప్రయోగాలు..
తెలుగులో 'శివ మనసులో శృతి', 'రొటీన్ లవ్ స్టోరీ', 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్', 'ఎవరు' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన రెజీనా.. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల అజిత్ నటించిన తమిళ చిత్రం 'విదాముయర్చి'లో ప్రతినాయిక పాత్రలో కనిపించి మెప్పించారు. హీరోయిన్‌గా అలరించిన రెజీనా.. ఇప్పుడు ప్రతినాయిక పాత్రలతోనూ తన నటనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. అలా ఈ రోజు విడుదలైన నయనతార 'మహాశక్తి' మూవీలోనూ నెగిటివ్ రోల్‌లో ప్రేక్షకులను మెప్పించారు.

సినిమా న్యూస్

రామాయణం'పై డైరెక్టర్ శంకర్ ప్రశంసల వర్షం

తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణం' చిత్రంపై సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికే డైరెక్టర్ రాజమౌళి, మహేశ్‌బాబు, సందీప్ రెడ్డి వంగా, విజయ్‌దేవరకొండ వంటి ప్రముఖులు ప్రశంసలు కురిపించగా ఇప్పుడీ జాబితాలోకి ప్రముఖ దర్శకుడు శంకర్ చేరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం సినీ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.గొప్ప అనుభూతిని కలిగిస్తున్నాయి

'భారతీయ సినిమాలో ఇలాంటి విజువల్స్‌ను ఇప్పటివరకు చూడలేదు. నమిత్ మల్హోత్రా, నితేశ్ తివారీ భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను. అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, గొప్ప నిర్మాణ విలువలు, మంచి రూపకల్పన, ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ అందించిన సంగీతం, భారీ సౌండ్ ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగిస్తున్నాయి' అని శంకర్ పేర్కొన్నారు.ఇక ఈ సినిమాలో యశ్ నటనపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. 'ప్రతి ఫ్రేమ్‌లో యశ్‌ను చూడటం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో ప్రేమించదగిన విలన్‌గా కనిపించారు. అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు' అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రణబీర్ కపూర్, సాయిపల్లవికి శుభాకాంక్షలు తెలిపారుకాగా రణబీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రామాయణ'. ఈ సినిమాకి నితేశ్ తివారీ దర్శకత్వం వహించారు. నమిత్ మల్హోత్రా నిర్మించిన ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించారు.



భారతీయుడిగా గర్విస్తున్నా..

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' నవంబరు 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది. అయితే ఈ సినిమాలో శూర్పణఖ కీలక పాత్రలో నటించిన ప్రముఖ నటి రకుల్ ప్రీత్‌సింగ్ తాజాగా తన అనుభవాలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.భారతీయుల సంస్కృతికి ప్రతీక అయిన రామాయణ గాథను ఇంత భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో వెండితెరపై ఆవిష్కరించడం తన జీవితంలో మరువలేని అద్భుతమైన అనుభూతినిచ్చిందని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అద్భుతమైన సినిమాను అందించాలనే వారి తపన తనకెంతో స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు.



'రామాయణ'పై మహేష్ బాబు ప్రశంసలు..

సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా 'రామాయణం' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ భారీ పౌరాణిక చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్, నటీనటుల అభినయం, భారీ నిర్మాణ విలువలపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, అట్లీ వంటి పలువురు ఈ చిత్రాన్ని మెచ్చుకోగా.. తాజాగా మహేష్ బాబు కూడా తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. 'రామాయణ' పార్ట్-1 సినిమా చూసిన మహేష్ బాబు.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన పురాణ గాథను ఇంత అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవిల నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇంత భారీ స్థాయిలో సినిమాను నిర్మించడానికి కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. 'రామాయణ' చిత్ర బృందం మొత్తం అభినందనలకు అర్హులని మహేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఆయన తదుపరి చిత్రం 'వారణాసి' గురించి కూడా చర్చకు దారితీసింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ఈ భారీ చిత్రం సోషియో ఫాంటసీ, టైమ్ ట్రావెల్, మైథలాజికల్ అంశాల కలయికతో రూపొందుతోంది. ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ అత్యంత కీలకంగా ఉండనుంది.ఈ చిత్రంలో మహేష్ బాబు తొలిసారిగా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణ ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. రాముడి పాత్ర కోసం మహేష్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. మహేష్ బాబును శ్రీరాముడి పాత్రలో చూపించేందుకు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. లుక్ టెస్ట్ సమయంలో మహేష్‌ను రాముడి గెటప్‌లో చూసి తాను ఆశ్చర్యపోయానని గతంలో రాజమౌళి వెల్లడించారు. దీంతో 'వారణాసి'లో మహేష్ రాముడి అవతారంలో ఎలా కనిపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.ఇక 'రామాయణం' సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, మహేష్ బాబు రాముడి పాత్రలో ఎలా మెప్పిస్తారనే చర్చ మొదలైంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే



ట్రెండింగ్‌లో 'రామాయణం' మండోదరి..



టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ భారీ పౌరాణిక చిత్రం 'రామాయణం' తో బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె రావణాసురుడి భార్య మండోదరి పాత్రలో నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఇక సినిమా విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కాజల్ అందం, అభినయం గురించిన చర్చలే ప్రధానంగా ట్రెండింగ్‌లో నిలిచాయి.పెళ్లి మరియు సెకండ్ ఇన్నింగ్స్ తర్వాత కూడా కాజల్ తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. రాణి మండోదరి పాత్రలో ఆమె రాజసం ఉట్టిపడేలా కనిపిస్తూ, వెండితెరపై ఒక ప్రత్యేకమైన ముద్ర వేశారు.

అప్పట్లో 'మగధీర' చిత్రంలో యువరాణిగా ప్రేక్షకులను అలరించిన కాజల్, ఈ పౌరాణిక చిత్రంలో మరింత పరిపక్వతతో కూడిన నటనను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంటున్నారు. కాజల్ స్క్రీన్ ప్రజెన్స్ మరియు ఆమె పాత్ర ప్రాధాన్యతపై సినిమా విడుదల తర్వాత పెద్ద ఎత్తున చర్చ జరిగింది.ప్రభావితం చేసే అత్యంత కీలకమైన పాత్రలో ఆమె ఒదిగిపోయిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com